క్లుప్తంగా

పనులపై ఆరా



వెంకటాచలం: మండలంలోని నిడిగుంట పాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళ వారం డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి ట్రస్ట్ ప్రతిని ధులు యరపు నాగార్జునరెడ్డి, రవీంద్రారెడ్డి సందర్శించారు. జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంకా చేయాల్సిన పనుల గురించి ప్రధానోపాధ్యాయులు సీహెచ్ చలపతి, టీచర్లతో చర్చించారు.

రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న ఏడీఏ

పొదలకూరు: మండలంలోని తాటిపర్తిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల వినియోగం, అధిక మోతాదులో యూరియా ఉపయోగిస్తే కలిగే ఫలితాల గురించి శాస్త్రవేత్తలు వెల్లడించారు. వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు, పురుగుమందుల వాడకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెల్లూరు ఏడీఏ మారుతీదేవి, శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ, పొదలకూరు ఏడీఏ శివనాయక్, ఏఓ ప్రతాప్, హెచ్ఓ ఆనంద్, వీఏఏలు పాల్గొన్నారు.

అధ్యాపకులకు పోటీలు



చెస్‌లో తలపడుతూ..

వెంకటాచలం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో మంగళవారం వివిధ పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ బాల్, షార్ట్ రన్, షాట్‌పుట్, డిస్క్ త్రో, త్రోబాల్, చెస్, క్రికెట్, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీల్లో అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ విజయ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మినీ వాహనాన్ని బుచ్చిరెడ్డిపాళెం టోల్‌ప్లాజా వద్ద ఎస్సై సంతోష్‌రెడ్డి, సివిల్ సప్లయ్స్ డీటీ సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. సంగం వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న ఈ వాహనంలో సుమారు రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ శ్రీనివాసులురెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

శాంతినగర్‌లో తాగునీటి సమస్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో తాగునీటికి తీవ్ర సమస్య ఏర్పడింది. దాదాపు నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని, దీనిపై అధికారులకు తెలియజేసినా, పట్టించుకోడం లేదని స్థానికులు ఆరోపించారు. మోటార్ కాలిపోయిందని, పైగా అందుబాటులో లేక పోవడంతో బిగించలేమని వారు చెప్పారన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతులకు మెడికల్ క్యాంపు నేడు

నెల్లూరు (టౌన్): విభిన్న ప్రతిభా వంతులకు సంబంధించి మెడికల్ క్యాంపును బుధవారం స్థానిక దర్గామిట్టలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు డీఈఓ బాలాజీరావు, సమ గ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్యలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలువాయి, రాపూరు మండలాలతోపాటు నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 80 మంది సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. 6 నుంచి 14 ఏళ్ల వయస్సు ఉన్న విద్యార్థులకు చెవి, కంటి, శారీరక, మానసిక విభాగాల వైద్యులతో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇతర వివరాల కోసం 9182302220 నంబరులో సంప్రదించాలన్నారు.



ఇందుకూరుపేట: కుడితిపాళెంలో..



ఇందుకూరుపేట: దేవిస్‌పేటలో..



కోవూరులో..



కోవూరు: మైథిలీ సెంటర్‌లో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బస్టాండ్ సెంటర్‌లో..

రాజన్నా.. నీ మేలు మరువలేము

• వైఎస్సార్‌కు ఘన నివాళులు

పొదలకూరు: పేదలకు మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి చేసిన మేలు మరువలేమని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో మంగళవారం రాజన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య వైఎస్సార్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.సుబ్బరాయుడు, నాయకులు కేతు రామిరెడ్డి, ఎస్‌కే అంజాద్, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.రమణారెడ్డి, పి.శంకరయ్య, డి.విజయ భాస్కర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, సీహెచ్ రమేష్, పూకోటి లక్ష్మీనారాయణ, సన్నికంటి శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరులో నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

⇨ మండలంలోని తాటిపర్తిలో వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు, యువకులు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు పి.లచ్చారెడ్డి, శ్రీహరి, నంది శ్రీనివాసులురెడ్డి, సంతోష్‌రెడ్డి, ఎ.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ మండలంలోని మొగళ్లూరులో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ ఆకుల లక్ష్మి, ఎంపీటీసీ చెన్నూరు విజయలక్ష్మి, నాయకులు యనమల శ్రీనివాసులురెడ్డి, రెడ్డిచెర్ల అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ మండలంలోని కల్యాణపురం గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించా రు. నాయకులు దయాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గంగిరెడ్డి, గణేష్‌రెడ్డి, యానాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ **ముత్తుకూరు(పొదలకూరు):** మండల కేంద్రం ముత్తుకూరులో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

⇨ మండలంలోని పంటపాళెం గ్రామంలో వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ నాయకులు, అభిమానులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆలపాలక శ్రీనివాసులురెడ్డి, రావి విజయకుమార్‌రెడ్డి, ఎస్.చెంగారెడ్డి, పి.దిలీప్, రావి అయ్యప్పరెడ్డి, టి.బ్రహ్మానందం, మల్లికార్జున పాల్గొన్నారు.

⇨ **తోటపల్లిగూడూరు:** వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయం ఎదుట ఉన్న రాజన్న విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్‌లను ప్రవేశపెట్టి ప్రాణదాత అయ్యారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థులకు అండగా నిలిచినట్లు చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి అడుగుజాడల్లో నడిచి ఐదేళ్లపాటు సీఎంగా ప్రజారంజక పాలన సాగించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తూ ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి, తలమంచి సురేంద్ర బాబు, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, కాల్తిరెడ్డి సుబ్బారావు, చెరుకూరు శ్రీనివాసులునాయుడు, నెల్లిపూడి సునీల్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, తిరవళ్లూరు ఈశ్వరయ్య, రాయపు శీనయ్య, ఎంబేటి సంధ్యారాణి, పాకం ప్రవీణ్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

⇨ మండలంలోని ఈదూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రాజన్నకు ఘన నివాళులర్పించారు. పార్టీ మాజీ మండల కన్వీనర్ టంగుటూరు పద్మనాభరెడ్డి మాట్లాడారు. వైఎస్సార్ అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం జాయింట్ సెక్రటరీ శంశీకృష్ణారెడ్డి, నాయకులు టంగుటూరు సురేష్‌రెడ్డి, నంగా శ్రీనివాసులురెడ్డి, గోనెల వినోద్‌కుమార్, వేణుగోపాల్ గౌడ్, గోడా సురేష్, ఉప్పల పరమేశ్వర్, సునీల్, మున్వర్‌భాష, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ **వెంకటాచలం:** దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సర్వేపల్లి గ్రామంలో నిర్వహించారు. రాజన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, పేదలకు పండ్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని కొనియాడారు. ఆ తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాకే మళ్లీ పేదలకు పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణిదెల మోహన్‌నాయుడు, జెడ్పీటీసీ పొట్లూరు సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు ఆరుగుంట ప్రభాకర్ రెడ్డి, కొణిదెన మోహన్‌నాయుడు, ఎంపీటీసీలు చిట్టమూరు శివకుమార్‌రెడ్డి, రాపూరు అంకయ్య, నాయకులు మందల పెంచలయ్య, నలగర్ల నరసింహారావు, ముంగర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

⇨ **మనుబోలు:** వైఎస్సార్ వర్ధంతిని మనుబోలులో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాజన్న ఒకడుగు ముందుకేస్తే ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి రెండడుగులు ముందుకేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, నాయకులు ముంగర రవీందర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి పార్థేశ్వరరెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, గుంజి రమేష్, చల్లా నవకోటి, తుపాకుల గిరి, పార్థు, కేవీఆర్ గౌడ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ **ఇందుకూరుపేట:** మహానేత వైఎస్సార్ వర్ధంతిని వాడవాడలా నిర్వహించారు. మండలంలోని కుడితిపాళెంలో నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మావులూరు శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు.

⇨ దేవిస్‌పేట కూడలిలో నిర్వహించిన కార్యక్రమానికి డీఏల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ హాజరయ్యారు.

⇨ కొరుటూరు, సోమరాజుపల్లి, గంగపట్నం, ఇందుకూరుపేట, రావూరు, పల్లిపాడు, నిడిముసలి, ముదివర్తిపాళెం, జగదేవిపేట, కొమరిక తదితర గ్రామాల్లో కార్యక్రమాలను నిర్వహించారు.

⇨ **కోవూరు:** పట్టణంలోని మైథిలీ సెంటర్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రైతులను అన్ని విధాలా ఆదుకున్నారని చెప్పారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు తప్ప, ప్రస్తుతం ఏమీ చేయడంలేదని ధ్వజమెత్తారు.

⇨ అన్నదానాన్ని సుధాకర్‌రెడ్డి, నాగేటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వీరిని సత్కరించారు.

⇨ **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు నివాళులర్పించారు. పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్లు షాహుల్, చెర్లో సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ **కొడవలూరు:** పేదల గుండెచప్పుడు వైఎస్సార్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొనియాడారు. నార్తురాజుపాళెంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. పార్టీ నేత పెనాక నాగ శ్రీనివాసులురెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి, ఎంపీపీ జ్యోతి, సర్పంచ్‌లు సుప్రియ, రంగారెడ్డి, రమేష్, నవీన్, నేతలు మోహనకృష్ణ, మాణిక్యరావు, దేవనబోయిన శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

⇨ యల్లాయపాళెంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. నేతలు తాటిపర్తి భాస్కర్, ప్రసాద్‌రెడ్డి, మహబూబ్‌బాషా, జానీబాషా, అనిల్, పెంచలయ్య, శ్రీకాంత్, కృష్ణారెడ్డి, శ్రీను, షమీ తదితరులు పాల్గొన్నారు.

⇨ **విడవలూరు:** మండలంలోని విడవలూరు, పార్లపల్లి, రామతీర్థం, ముదివర్తి, చౌకచర్ల గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. రామతీర్థంలో వైఎస్సార్ చిత్రపటానికి క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, పొన్నలూరు బుజ్జిరెడ్డి, వేణుంబాక విష్ణువర్ధన్, వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ప్రళయకావేరి బాషా, హరి, తిరుపతి, కరుణాకర్ పాల్గొన్నారు.



కల్యాణపురంలో..



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..



కోవూరు: అన్నదానం



పొదలకూరు: తాటిపర్తిలో..



పొదలకూరు: మొగళ్లూరులో..



ముత్తుకూరులో..



పంటపాళెంలో..



కొడవలూరు: యల్లాయపాళెంలో..



తోటపల్లిగూడూరు: మండల కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



తోటపల్లిగూడూరు: ఈదూరులో..



సర్వేపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు



మనుబోలు: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



విడవలూరులో..

వైభవంగా నిమజ్జనాలు



యువకులతో ఎస్సై శివరాకేష్



గ్రామోత్సవం

మనుబోలు: మనుబోలులోని వివిధ మండపాల్లో కొలువుదీర్చిన బొజ్జ గణపయ్యలకు సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించి గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

కోవూరు: పట్టణంలోని టీఎస్సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థుల సహాయార్థం నగదు ప్రోత్సాహకానికి క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ ముందుకొచ్చింది. ఈ ఏడాదిలో నిర్వహించిన ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన నలుగురికి రూ.పది వేల చొప్పున అందజేశారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సికిందర్, ఏరియా మేనేజర్ ఫిరోజ్, బ్రాంచ్ మేనేజర్ నవీన్‌కుమార్, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి కృష్ణారెడ్డి, సమగ్ర శిక్ష పీఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



6న చలో విజయవాడ

నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమాన్ని ఈ నెల ఆరున నిర్వహించనున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బాలాజీనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందజేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరాక విద్యార్థులకు సంబంధించిన ఏ సమస్యనూ పరిష్కరించలేదని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు విష్ణు, జీవన్, దావూద్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

కాకాణితో మేయర్ భేటీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మేయర్ స్రవంతి, జయవర్ధన్ దంపతులు మంగళవారం కలిశారు. పలు అంశాలపై పార్టీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి తదితరులతో చర్చించారు.

మానేగుంటపాడులో నేత్ర వైద్యశిబిరం నేడు

కొడవలూరు: మండలంలోని మానేగుంటపాడులో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని పాలిచర్ల జనార్దన్‌రెడ్డి, శారదమ్మ, పాలిచర్ల శ్రీనివాసులురెడ్డి జ్ఞాపకార్థం పారిశ్రామికవేత్త ప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నారని కారెంపూడి సుబ్బరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించనున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇరువర్గాల ఘర్షణ

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని బోడిస్వామికండ్రికలో సోమవారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగి రాళ్లు రువ్వుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. నిమజ్జనానికి వెళ్లి యువకులు ట్రాక్టర్‌ను శుభ్రపరుచుకునే విషయంలో గొడవ నెలకొని పరస్పరం దాడులకు పాల్పడ్డారు. పలువురికి గాయాలైన విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఎవరిపైనా కేసులు నమోదు చేయలేదని తెలిసింది.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

తోటపల్లిగూడూరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి సూచించారు. మండలంలోని పాపిరెడ్డి పాళెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ వరిసాగు లాభసాటిగా మారాలంటే ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలన్నారు. భూమి సారవంతం కావాలంటే పచ్చిరొట్టి విత్తనాలను పోలిన పీఎండీఎస్ కిట్లను పొలాల్లో చల్లుకోవాలన్నారు. ఈ కిట్లలో ఉన్న పలు రకాల విత్తనాలు భూసారాన్ని పెంచి పంట అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుందన్నారు. అలాగే యూరియా వాడకం గణనీయంగా తగ్గించుకోవచ్చాన్నారు. అనంతరం పలువురు రైతులకు సబ్సిడీపై పీఎండీఎస్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఎం రాజ్‌కుమార్, ఏడీఏ నర్సోజీరావు, రైతు సంఘం అధ్యక్షుడు గంగపట్నం రమణయ్య, వీఏఏలు పార్వతి, వినీల్, సుమంత్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

⇨ **మనుబోలు:** రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించి నేల స్వభావానికి అనుగుణంగా ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య సూచించారు. మండలంలోని వెంకన్నపాళెం, పిడూరుపాళెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగంలో నియంత్రణ పాటించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ దివ్య పాల్గొన్నారు.

కోవూరు: మండలంలోని మోడేగుంట, లేగుంటపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలను కోవూరు సహాయ వ్యవసాయాధికారి అనిత పరిశీలించారు. ఏఓ నీరజ, వీఏఏ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరులో..



మనుబోలులో పొలం పిలుస్తోంది



కోవూరులో..

ప్రశాంతమ్మా.. పింఛన్లు ఇప్పించండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వార్డు విజిట్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 11వ వార్డులో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మంగళవారం పర్యటించారు. పలు వీధుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలను ఆరాతీశారు. తనకు పక్షవాతమని.. పింఛన్‌ను మంజూరు చేయాలని సత్యవేటి రాంబాబు కోరారు. చెన్నయ్య సైతం ఇదే సమస్యను తెలియజేసి, తనకు మంజూరు చేయాలని అభ్యర్థించారు.